ఉత్తరప్రదేశ్‌లోని మైన్‌పురిలో గల భోలే బాబా ఆశ్రమం

భోలే బాబాకు 100 కోట్ల ఆస్తులు

దేశవ్యాప్తంగా 24 ఆశ్రమాలు.. లగ్జరీ కార్లు

లక్నో, జూలై 5: దైవాంశ సంభూతుడిగా చెప్పుకొని తిరుగుతున్న సూరజ్ పాల్ అలియాస్ భోలే బాబా గత రెండు దశాబ్దాల్లో రూ.100 కోట్ల ఆస్తులు సంపాదించినట్టు తెలుస్తున్నది. ఇటీవల యూపీలోని హాథ్రస్‌లో జరిగిన తొక్కిసలాట ఘటనపై జరుగుతున్న దర్యాప్తు సందర్భంగా అతడి సంపద వివరాలు బయటపడుతున్నాయి. తొక్కిసలాటలో 121 మంది చనిపోయినా అతడిపై భక్తులకు ఇంకా నమ్మకం సడలకపోవడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. ఉత్తరప్రదేశ్‌లోని మైన్‌పురిలో ఉండే అతడి 'ఫైవ్ స్టార్' ఆశ్రమం ఒక ప్యాలెస్‌లాగా ఉంటుంది. ఈ ఆశ్రమాన్ని రూ.4 కోట్ల విలువైన భూమిలో నిర్మించారు. అతడి సంరక్షకులు కొందరు ఈ భూమిని విరాళంగా ఇచ్చినట్టు సమాచారం. దాంతోపాటు 50 బిగాల భూమిని భోలే బాబా లీజుకు తీసుకున్నారు. అతడి ట్రస్టుకు కస్‌గంజ్, ఆగ్రా, కాన్పూర్, గ్వాలియర్‌లలో వందలాది బిగాల భూములున్నాయి. భోలే బాబా తన భక్తుల పేరిట కొన్ని లగ్జరీ కార్లు కొన్నట్టు ఆరోపణలున్నాయి. ఆయనకు దేశ వ్యాప్తంగా 24 ఆశ్రమాలున్నాయని సమాచారం. ఒక ఆశ్రమంలో విరాళాలు స్వీకరించమనే బోర్డు ఉంది. అయితే అందుకు భిన్నంగా అక్కడి గోడలపై ఆశ్రమానికి నగదు, భూములు, సిమెంట్, వాహనాలు దానం చేసిన దాతల పేర్లు కనిపించాయి.

పనులన్నీ ఆపేస్తాం!

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వానికి కాంట్రాక్టర్ల హెచ్చరిక

- బిల్లుల విడుదలలో జాప్యంపై తీవ్ర ఆగ్రహం
- బీబీఎంపీలో నిలిచిన రూ.1,500 కోట్ల చెల్లింపులు
- వెంటనే బిల్లులు విడుదల చేయాలని డిమాండ్

బెంగళూరు, జూలై 5: కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వంపై కాంట్రాక్టర్లు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. పూర్తి చేసిన పలు పనులకు సంబంధించిన బిల్లులను విడుదల చేయకపోవడంపై మండిపడుతున్నారు. వీలైనంత త్వరగా పెండింగ్ బిల్లులను విడుదల చేయకుంటే ప్రస్తుతం జరుగుతున్న పనులన్నింటినీ ఆపేస్తామని రాష్ట్ర రాజధాని బెంగళూరు నగర పాలక సంస్థ(బీబీఎంపీ) పరిధిలోని కాంట్రాక్టర్లు తాజాగా హెచ్చరికలు చేశారు. నగర పాలక సంస్థకు ఆదాయం వస్తున్నా గత రెండేండ్లలో పూర్తి చేసిన పలు పనులకు సంబంధించిన రూ.1,500 కోట్ల మేర బిల్లులను ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిందని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల విడుదలలో జాప్యంతో తమ ఆర్థిక ఇబ్బందులు మరింత తీవ్రమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎన్నిసార్లు అభ్యర్థించినా..

కాంట్రాక్టర్ల అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు మంజునాథ్ మాట్లాడుతూ బీబీఎంపీ చీఫ్ కమిషనర్‌గా తుషార్ గిరినాథ్ వచ్చిన ప్పటి నుంచి కాంట్రాక్టర్లు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. బిల్లుల విడుదలకు సంబంధించి ఎన్నిసార్లు అభ్యర్థనలు చేసినా అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లు తీవ్ర ఒత్తిడి పరిస్థితులను ఎదుర్కొంటున్నారని చెప్పారు. గత రెండేండ్లలో చేపట్టిన పలు ప్రాజెక్టులకు సంబంధించి రూ.1,500 కోట్ల బిల్లులు రావాల్సి ఉన్నదని పేర్కొన్నారు. ఎలాంటి కారణం లేకుండా బీబీఎంపీ యంత్రాంగం 25 శాతం బిల్లులను ఉద్దేశపూర్వకంగా నిలిపివేస్తున్నదని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు.

శ్వేతపత్రం విడుదల చేయాలి..

కాంట్రాక్టర్ల పరిస్థితిపై అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ పరస్పరం దుమ్మెత్తి పోసుకొన్నాయి. బిల్లులు ఇచ్చేందుకు ప్రభుత్వం వద్ద నిధులే లేవని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం విడుదల చేయాలని బీజేపీ ఎమ్మెల్యే భరత్ శెట్టి అన్నారు. గత బీజేపీ ప్రభుత్వ '40% కమీషన్' స్కామ్ వల్లనే బిల్లుల విడుదల జాప్యం నెలకొన్నదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి సంతోష్ విమర్శించారు. బకాయిలు చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకొంటున్నామని చెప్పారు.

అస్సాంలో వరద బీభత్సం

24 లక్షల మందిపై ప్రభావం

గువాహటి: అస్సాంలో వరద బీభత్సం జన జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నది. ఈ దయనీయ పరిస్థితి శుక్రవారం మరింత తీవ్రరూపం దాల్చింది. 30 జిల్లాల్లోని 24.20 లక్షల మందిపై ఈ ప్రభావం పడింది. ప్రధాన నదులు ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. కొండచరియ విరిగిపడటంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, మరొకరు గాయపడ్డారు. 63,490.97 హెక్టార్ల సాగు భూములు నీట మునిగాయి. వర్షాల సంబంధిత ప్రమాదాల కారణంగా ఇప్పటివరకు 64 మంది మరణించారు.

పౌరసత్వానికి ఆధార్ రుజువు కాదు

కోల్‌కతా, జూలై 5: ఆధార్ కలిగి ఉండటం పౌరసత్వం లేదా నివాసానికి రుజువు కాదని భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ) సీనియర్ కౌన్సెల్ లక్ష్మీ గుప్తా గురువారం కలకత్తా హైకోర్టుకు నివేదించారు. ప్రభుత్వ రాయితీల కోసం దేశంలో 182 రోజులు నివసించే వారికి ఆధార్ కార్డ్ జారీ చేస్తారని లక్ష్మీ గుప్తా తెలిపారు. విదేశీయులకు సంబంధించి ఆధార్ చట్టంలో ఉన్న 28ఏ నిబంధనను తొలగించాలని జాయింట్ ఫోరమ్ అగైనెస్ట్ ఎన్‌ఆర్‌సీ కోరిన నేపథ్యంలో గుప్తా ఈ వివరణ ఇచ్చారు.

నిద్ర సరిపోవట్లేదు.. రాత్రి 8 తర్వాత ప్రచారం చేయలేను

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్

వాషింగ్టన్, జూలై 5: ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ డెమోక్రాటిక్ అభ్యర్థిత్వంపై వ్యతిరేక ప్రచారం జరుగుతుండగా, తాజాగా ఆయన మరో ప్రకటన సంచలనానికి దారితీసింది. తనకు నిద్ర సరిపోవట్లేదని, రాత్రి 8 గంటల తర్వాత ప్రచారంలో పాల్గొనలేనని, అర్ధరాత్రి షెడ్యూల్ వద్దని తన పార్టీ వారిని ఆదేశించినట్టు 'న్యూయార్క్ టైమ్స్' తన కథనంలో



పేర్కొంది. వైట్‌హౌస్‌లో ప్రత్యక్షంగా పాల్గొన్న గవర్నర్లు, వర్చువల్‌గా హాజరైన పార్టీ నేతలను ఉద్దేశించి సంయుక్తంగా ప్రసంగిస్తూ తనకు తేలికైన పని భారం, విశ్రాంతి అవసరమని ఆయన నొక్కిచెప్పారు. గత నెలలో ట్రంప్‌తో జరిగిన డిబేట్‌లో ఆయన తడబాటుకు గురవ్వడంతో డెమోక్రాట్లలో ఆందోళన వ్యక్తమైంది. విస్తృతంగా చేపట్టిన అంతర్జాతీయ పర్యటనల కారణంగా ఏర్పడిన అలసటతో తాను ఆ రోజు డిబేట్‌లో వెనుకబడ్డానని ఇప్పటికే బైడెన్ స్పష్టం చేశారు.

అదానీ గ్రూప్‌కిచ్చిన భూములు తిరిగి వెనక్కి

- హైకోర్టుకు తెలిపిన గుజరాత్ సర్కారు
- ఫలించిన గ్రామస్థుల పోరాటం..
- 13 ఏండ్ల తర్వాత విజయం

అహ్మదాబాద్, జూలై 5: గుజరాత్‌లోని ముంద్రాపోర్టు సమీపంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త అదానీకి కట్టబెట్టిన 108 హెక్టార్ల పచ్చిక భూమిని వెనక్కి తీసుకుంటున్నట్టు హైకోర్టుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. నవీనల్ గ్రామస్థుల అలుపెరుగని పోరుతో రాష్ట్ర బీజేపీ సర్కారు వెనక్కి తగ్గింది. నరేంద్రమోదీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2005లో అదానీ పోర్ట్స్, సెజ్ లిమిటెడ్‌కు ప్రభుత్వం 231 ఎకరాల భూమిని కేటాయించింది. 2010లో ఆ స్థలంలో ఏపీసెజ్ ఫెన్సింగ్ వేయడం ప్రారంభించడంతో ఈ విషయం గ్రామస్థులకు తెలిసింది. దీంతో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వారు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అదానీకి భూమి కేటాయించిన తర్వాత కేవలం 45 ఎకరాల పచ్చిక భూమి మాత్రమే మిగిలిందని వారు పేర్కొన్నారు. ఇప్పటికే పచ్చిక భూమి కొరత ఉండగా, ప్రభుత్వం ఆ భూమిని కేటాయించడం చట్టవిరుద్ధమని, పైగా ఆ భూమి కమ్యూనిటీ వనరు అని వివరించారు. ఈ క్రమంలో పశువుల మేత కోసం అదనంగా 387 హెక్టార్లు కేటాస్తామని ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేయడంతో 2014లో కేసును కొట్టివేశారు. అనంతరం ప్రభుత్వం మాట నిలుపుకోకపోవడంతో కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలైంది. పంచాయతీకి కేటాయించేందుకు 17 హెక్టార్ల భూమే అందుబాటులో ఉన్నదని, వారికి ఏడు కిలోమీటర్ల దూరంలో ప్రత్యామ్నాయ భూమిని కేటాయిస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వం తెలిపింది. ఇందుకు గ్రామస్థులు ససేమిరా అన్నారు. ఈ క్రమంలో అదానీకి కేటాయించిన భూమిని వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది.

సరగేట్ తల్లులకు ప్రసూతి సెలవులు

భువనేశ్వర్: సరగసీ ద్వారా తల్లులయ్యే ప్రభుత్వోద్యోగినులకు కూడా ప్రసూతి సెలవులు, ఇతర ప్రయోజనాలను పొందే హక్కు ఉందని ఒరిస్సా హైకోర్టు తీర్పు చెప్పింది. సహజంగా తల్లులయ్యేవారికి లేదా దత్తత తల్లులకు లభించే అన్ని సదుపాయాలు వీరికి కూడా ఇవ్వాలని తెలిపింది. ఒడిశా ఫైనాన్స్ సర్వీస్‌లో పని చేస్తున్న సుప్రియ జెనా 2020లో దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు తాజాగా ఈ తీర్పునిచ్చింది.

దేశ రక్షణలో అసమాన ధైర్య సాహసాలు కనబరిచిన 10 మంది సైనికులకు కీర్తి చక్ర, 26 మందికి శౌర్య చక్ర పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో అందించారు. 26వ బెటాలియన్ పంజాబ్ రెజిమెంట్‌కు చెందిన కెప్టెన్ అన్షుమన్ సింగ్‌కు మరణానంతరం ప్రకటించిన కీర్తి చక్ర పురస్కారాన్ని ఆయన కుటుంబ సభ్యులు స్వీకరించారు.

ఆగ్రాలో అగ్నివీర్ సైనికుడి ఆత్మహత్య

ఆగ్రా: అగ్నివీర్ సైనికుడొకరు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆగ్రాలోని ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో పనిచేస్తున్న 22 ఏండ్ల శ్రీకాంత్ కుమార్ చౌదరి మంగళవారం అర్ధరాత్రి తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. గురువారం భారత వైమానిక దళ గౌరవ వందనం మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. శ్రీకాంత్ కుమార్ మృతికి కారణాలు తెలియరాలేదని, ఎలాంటి సూసైడ్ నోట్ లభించలేదని షాహగంజ్ పోలీసులు తెలిపారు.

కేంద్రం నుంచి పరిహారం రాలేదు

- అగ్నివీర్ బంధువు వెల్లడి

లూధియానా: అగ్నివీర్ పథకంపై వివాదం తీవ్ర రూపం దాల్చుతున్నది. జమ్ము కశ్మీరులోని రాజౌరీ సెక్టర్‌లో ఈ ఏడాది జనవరిలో జరిగిన మందుపాతర పేలుడులో అమరుడైన అజయ్ సింగ్ కుటుంబ సభ్యులు చెప్తున్న వివరాలు ఈ వివాదానికి మరింత ఊతమిస్తున్నాయి. అజయ్ తండ్రి చరణ్‌జిత్ మాట్లాడుతూ, తన కుమారునికి రూ.48 లక్షలు బీమా సైన్యం నుంచి వచ్చిందని, ఇది ఎక్స్‌గ్రేషియా కాదని చెప్పారు. మరో రూ.50 లక్షలు ఓ ప్రైవేట్ బ్యాంకు నుంచి వచ్చిందని, ఇది కూడా తన కుమారుని ఇన్సూరెన్స్ పాలసీయేనని వివరించారు. పంజాబ్ ప్రభుత్వం రూ.1 కోటి నష్టపరిహారం ఇచ్చిందని చెప్పారు. కేంద్రం లేదా సైన్యం తన కుమారుని మరణానంతరం నష్టపరిహారం ఇవ్వలేదన్నారు.

శివసేన నేతపై కత్తులతో దాడి

లూధియానా: శివసేన (పంజాబ్) నేత సందీప్ థాపర్ (58)పై నలుగురు నిహంగ్ సిక్కులు శుక్రవారం నడిరోడ్డుపై పట్టపగలే కత్తులతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన ఆయనను సమీపంలోని సివిల్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి నుంచి ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లి, చికిత్స చేయిస్తున్నారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ఈ దాడిని బీజేపీ తీవ్రంగా ఖండించింది. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది.

- శ్రీశైలంలో మరో శివలింగం

శ్రీశైలంలో మరో శివలింగం బయటపడింది. యాఫి థియేటర్ సమీపంలో సీసీ రోడ్డు పనుల్లో భాగంగా జేసీబీతో తొవ్వుతుండగా శివలింగం వెలుగుచూసింది. శివలింగంతో పాటు నంది విగ్రహం, ఓ లిపి కూడా ఉన్నాయి. విషయం తెలిసిన ప్రజలు అక్కడికి చేరుకొని పూజలు చేశారు. స్పందించిన పురావస్తు శాఖ అధికారులు అక్కడికి చేరుకొని లిపిని ఆర్కియాలజీ ల్యాబ్‌కు తీసుకెళ్లారు. -హైదరాబాద్

రెండు నెలల్లో 376 డెంగీ కేసులు

- వెల్లడించిన వైద్యారోగ్య శాఖ

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో గత రెండు నెలల్లో 376 డెంగీ కేసులు వెలుగుచూసినట్టు వైద్యారోగ్య శాఖ తెలిపింది. సీజనల్ వ్యాధులపై వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఏడాది మేలో 113 డెంగీ, 21 మలేరియా కేసులు, జూన్‌లో 263 డెంగీ, 9 మలేరియా కేసులు నమోదైనట్టు వెల్లడించారు. గతేడాదితో పోల్చితే ఈ కేసుల సంఖ్య తగ్గినట్టు తెలిపారు. సమీక్షలో కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఆయుష్ డైరెక్టర్ ప్రశాంతి, డీపీహెచ్ రవీంద్ర నాయక్, డీఎంఈ వాణి, ఐపీఎం డైరెక్టర్ శివలీల పాల్గొన్నారు.

5వేల కోట్ల కోసమేనా 'ప్రైవేటు'కు?

మొదటిపేజీ తరువాయి...

రైతాంగానికి ఇచ్చిన మాట ప్రకారం, ఈ విద్యుత్తు సంస్కరణలు అమలు చేయనందుకు నాటి కేసీఆర్ సర్కారు ఐదేండ్లలో సుమారుగా 25వేల కోట్ల రూపాయలు నష్టపోయింది. ఇప్పుడు అలవిగాని హామీలిచ్చి అధికారంలోకొచ్చిన కాంగ్రెస్, ఎఫ్‌ఆర్‌బీఎం సడలించడంతో వచ్చే ఐదు వేల కోట్ల కోసం కేంద్రం ముందు మోకరిల్లిందని విశ్లేషకులు చెబుతున్నారు. ఒకరకంగా తెలంగాణ ప్రజలు, రైతుల ప్రయోజనాలను కేంద్రానికి తాకట్టు పెట్టిందని విమర్శిస్తున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి ఇదే అంశంపై కేంద్రం పెద్దలతో చర్చించారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

దశలవారీగా ప్రైవేటీకరణ?

రాష్ట్రంలోని ప్రధాన ఆదాయ వనరులను క్రమపద్ధతిలో దశలవారీగా ప్రైవేటీకరిస్తారనే సందేహాలు కలుగుతున్నాయి. ఇందులో భాగంగా విద్యుత్ సంస్థలు నష్టాల్లో ఉన్నాయని నమ్మించేందుకు రేవంత్‌రెడ్డి సర్కారు విఫలయత్నాలు చేస్తున్నదని విద్యుత్తురంగ నిపుణులు అంటున్నారు. సంస్థలు నష్టాల్లో ఉంటే నాడు తలసరి విద్యుత్ వినియోగం (పవర్ క్యాపిటా) ఎలా సాధ్యమైందని? ప్రశ్నిస్తున్నారు. కావాలనే విద్యుత్తు సంస్థలు నష్టాల్లో ఉన్నట్టు చూపెడుతున్నారని వాపోతున్నారు. 'ఒక కుక్కను చంపాలంటే ముందుగా అది పిచ్చిది అనే ముద్ర వేయాలి' అన్న చందంగా ఇప్పుడు విద్యుత్ సంస్థలపై నష్టాల ముద్రవేసి వాటిని క్రమంగా ప్రైవేట్ పరం చేసే కుట్ర జరుగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భాగంగానే పైలట్ ప్రాజెక్టుగా హైదరాబాద్ పాతబస్తీ బిల్లింగ్‌ను తెరపైకి తెచ్చారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. నాడు దేశం మొత్తం తెలంగాణ విద్యుత్ సంస్థలను పొగిడిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వ పెద్దలే ప్రభుత్వ సంస్థలు నష్టాల్లో ఉన్నట్టు చూపితే రాష్ట్రానికి పెట్టుబడులు, కంపెనీలు వచ్చే అవకాశం ఉండకపోవచ్చని అభిప్రాయపడుతున్నారు. విద్యుత్ వ్యవస్థలో ప్రైవేటీకరణ జరిగితే ప్రభుత్వ డిస్కంలకు ఉరితాడు పడ్డట్టేనని హెచ్చరిస్తున్నారు.

అదానీ ఎవరి ట్రాన్స్‌మిషన్లు వాడుతారు?

నాడు కేంద్రం తెచ్చిన విద్యుత్ సంస్కరణలను వ్యతిరేకించిన కాంగ్రెస్ నాయకులు, ఇప్పుడు తెలంగాణలో అదానీకి పవర్ డిస్ట్రిబ్యూషన్‌ను అప్పగించడాన్ని ఎలా సమర్థిస్తారనే ప్రశ్నలు వస్తున్నాయి. 'ఎన్నో ప్రభుత్వరంగ సంస్థలను వదిలేసి బిల్లింగ్ విధానాన్ని అదానీకే ఎలా ఇస్తారు? ఏ ప్రాతిపదికన ఇస్తారు? నాడు వేల కోట్లు ఖర్చు పెట్టి ట్రాన్స్‌మిషన్ లైన్లు వేసుకున్నం.. రేపు అదానీ ఎవరి ట్రాన్స్‌మిషన్ లైన్లు వాడతారు? మనవి వాడతారా? కొత్తలైన్లు వేసుకుంటారా?' అని విద్యుత్తురంగ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. బిల్లింగ్‌కు ఓపెన్ టెండర్లు పిలుస్తారా? అసలు టెండర్లు లేకుండానే నామినేషన్ పద్ధతిలో కట్టబెడతారా? అని నిలదీస్తున్నారు. విద్యుత్ వ్యవస్థ ప్రైవేట్ పరమైతే ఎన్నో ఉద్యోగాలు ఊడిపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సంస్థ ప్రైవేటీకరణ వల్ల ఉద్యోగాలు రావని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రిజర్వేషన్లు ఆగమైతాయని అంటున్నారు. వీటికి తోడు నాణ్యమైన కరెంట్ ఇవ్వడం కూడా కష్టంగా మారే పరిస్థితులు ఏర్పడతాయని హెచ్చరిస్తున్నారు.

హీరో రాజ్‌తరుణ్‌పై ప్రియురాలి ఫిర్యాదు

- ప్రేమించి మోసం చేశాడని ఆరోపణ
- విచారణ చేపట్టిన నార్సింగి పోలీసులు



మణికొండ, జూలై 5: టాలీవుడ్ హీరో రాజ్‌తరుణ్ గతంలో రెడ్‌హ్యాండెడ్‌గా డ్రగ్స్ తీసుకుంటూ తన నివాసంలో పోలీసులకు దొరికిన విషయం మరవకముందే... తాజాగా మరో వివాదంలో చిక్కుకున్నాడు. పదకొండేండ్లుగా ప్రేమాయణం నడిపి తనను శారీరకంగా వాడుకుని ఇప్పుడు వదిలించుకునేందుకు యత్నిస్తున్నాడంటూ లావణ్య శుక్రవారం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేసింది. హీరో రాజ్‌తరుణ్, తాను పదకొండేండ్లుగా ప్రేమించుకుంటున్నామని, అనేక సార్లు శారీరకంగా కలిశామని లావణ్య ఫిర్యాదులో తెలిపింది. ఇప్పుడు వదిలించుకునేందుకు బెదిరింపులకు పాల్పడుతున్నాడని పేర్కొంది. ఓ హీరోయిన్‌తో ప్రేమాయణం నడుపుతూ, తనను మోసం చేయాలని చూస్తున్నాడని వాపోయింది. రాజ్‌తరుణ్‌ను వదిలేయాలని లేకపోతే తనను చంపేస్తానంటూ, అతడి సోదరుడు ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడుతున్నాడని వెల్లడించింది. గతంలో డ్రగ్స్ కేసులో తనను ఇరికించారని, రాజ్‌తరుణ్ కోసం తాను 45 రోజులపాటు జైలులో ఉన్నానని తెలిపింది. రాజ్‌తరుణ్ విచ్చలవిడిగా డ్రగ్స్‌కు అలవాటుపడి అమ్మాయిలతో పిచ్చిపిచ్చిగా వ్యవహరిస్తున్నారంటూ 4 పేజీల ఫిర్యాదును పోలీసులకు అందజేసింది. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు.

7న ముదిరాజ్‌ల సమావేశం

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 7న ఉదయం 10 గంటలకు అంబర్‌పేటలోని సత్యకమల ఫంక్షన్ హాల్‌లో ముదిరాజ్ సమావేశం నిర్వహించనున్నట్టు తెలంగాణ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు జగన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముదిరాజ్‌లను కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చులకనగా చూస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ, రాజ్యసభ, మంత్రి పదవుల్లో ఒక్కటి కూడా ముదిరాజ్‌లకు ఇవ్వలేదన్నారు. సమావేశానికి అన్ని జిల్లాల నుంచి ముదిరాజ్ నేతలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

వైద్యుడిపై దాడి?

- పిడిగుద్దులతో విరుచుకుపడ్డ మెడికల్ జేఏసీ నేతలు
- డీఎంఈ కార్యాలయం ఆవరణలోనే ఘటన

కోఠిలోని డీఎంఈ కార్యాలయంలో బైటాయించిన డాక్టర్ శేఖర్

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ) : డీఎంఈ కార్యాలయం ఆవరణలోనే ఓ డాక్టర్‌పై మెడికల్ జేఏసీ నేతలు దాడి చేశారు. హైదరాబాద్‌లో పాతుకుపోయినవారికి బదిలీల్లో స్థానచలనం కల్పించి, జిల్లాల్లో ఉన్నవారికి అవకాశం కల్పించాలని కోరేందుకు వచ్చిన డాక్టర్‌పై పిడిగుద్దులతో విరుచుకుపడ్డారు. బాధితుడు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. నాగర్ కర్నూల్ జిల్లా మెడికల్ కాలేజీలోని ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ శేఖర్ శుక్రవారం డీఎంఈ కార్యాలయానికి వచ్చారు. ఆయన ఆఫీస్‌లో అడుగు పెడుతుండగా.. తెలంగాణ ప్రభుత్వ వైద్య సంఘం/మెడికల్ జేఏసీ నేతలు డాక్టర్ బొంగు రమేశ్, డాక్టర్ పల్లం ప్రవీణ్, డాక్టర్ వినోద్‌తోపాటు మరికొందరు ఆయనపై దాడికి పాల్పడినట్లు చెబుతున్నారు. టీ కప్పులతో తలపై కొట్టారని, కింద పడేశారని పేర్కొన్నారు. దాంతో డాక్టర్ శేఖర్ అక్కడే బైటాయించారు. తనపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తనకు న్యాయం జరిగే వరకు ఆమరణ దీక్ష చేస్తానని హెచ్చరించారు. దాడి ఘటనపై డీఎంఈ డాక్టర్ వాణికి ఫిర్యాదు చేశానన్నారు. సాధారణ బదిలీలపై ప్రభుత్వం ఇచ్చిన జీవోను అమలు చేయాలని డీఎంఈకి వినతి పత్రం ఇచ్చేందుకు ఇక్కడికి వచ్చినట్లు చెప్పారు. ఈ ఘటనపై డాక్టర్ బొంగు రమేశ్ స్పందించి తాము డాక్టర్ శేఖర్‌పై ఎలాంటి దాడి చేయలేదని చెప్పారు. ఆయన కొన్ని రోజులుగా తమ సంఘంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, తమను దుర్భాషలాడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని ఆరోపించారు.

ఏసీబీకి చిక్కిన ఏఈ

- 15 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన బలవంత్‌రెడ్డి

బండ్లగూడ, జూలై 5 : కాంట్రాక్టర్ చేసిన పనికి బిల్లు మంజూరు చేయాల్సిన ఓ ఏఈ కాసుల కక్కుర్తితో ఏసీబీకి చిక్కాడు. కాంట్రాక్టర్ నుంచి డబ్బులు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. కేసుకు సంబంధించి అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ మజీద్ అలీఖాన్ తెలిపిన వివరాలు.. సంతోష్‌నగర్‌కు చెందిన ముజఫరుద్దీన్ రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని 11 వార్డు ఆదర్శనగర్‌లో రూ.6.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేశాడు. బిల్లు మంజూరు కోసం రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ అసిస్టెంట్ ఇంజినీర్ బలవంత్‌రెడ్డి కాంట్రాక్టర్ ముజఫరుద్దీన్‌ను రూ.24వేలు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశాడు. ఇద్దరి మధ్య బేరసారాల అనంతరం రూ.15 వేలకు ఒప్పందం కుదిరింది. ఈ విషయంలో ముజఫరుద్దీన్ ఏసీబీ అధికారులను సంప్రదించాడు. శుక్రవారం మధ్యాహ్నం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఏఈ బలవంత్‌రెడ్డి చాంబర్‌లో డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏఈని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

బలవంత్‌రెడ్డి

ఢిల్లీ జల్ బోర్డు కేసులో ఈడీ సోదాలు

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): ప్రైవేట్ కంపెనీకి వర్క్ కాంట్రాక్ట్ మంజూరులో అవినీతి జరిగిందని ఆరోపిస్తూ మనీలాండరింగ్ నమోదు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఢిల్లీ, అహ్మదాబాద్, ముంబై, హైదరాబాద్‌లో పలుచోట్ల శుక్రవారం సోదాలు నిర్వహించింది. ఈ కేసుకు సంబంధించి ఢిల్లీ జల్ బోర్డ్ (డీజేపీ) మాజీ చీఫ్ ఇంజినీర్ జగదీష్‌కుమార్ అరోరా, ఇతరులకు సంబంధించిన ఇండ్లు, ఆఫీసుల్లో సోదాలు చేపట్టింది. రూ.41లక్షల నగదు, పలు పత్రాలు, డిజిటల్ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్టు ప్రకటించింది. కాగా, రూ.38 కోట్ల కుంభకోణంలో ఇప్పటికే 8.80 కోట్ల విలువైన ఆస్తులను ఈడీకి తాత్కాలికంగా అటాచ్ చేసింది.

అటవీశాఖకు రూ.2.70కోట్లు విడుదల

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): అటవీ, పర్యావరణశాఖకు రాష్ట్రప్రభుత్వం రూ.2.70 కోట్ల నిధులను విడుదల చేసింది. వన్యప్రాణుల దాడుల్లో గాయపడిన, ప్రాణాలు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించేందుకు ఈ నిధులను కేటాయించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగానూ తెలంగాణ వన్యప్రాణి సంరక్షణ విభాగానికి నిధులను విడుదల చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆర్టీసీ బస్సులో గర్భిణికి ప్రసవం

- కండక్టర్, డ్రైవర్ పనితీరుకు ప్రశంసలు
- పొన్నం, సజ్జనార్ అభినందనలు

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ)/సుల్తాన్‌బజార్ : ఆర్టీసీ బస్సులో నిండు గర్భిణికి ప్రసవం చేసి ప్రభుత్వ దవాఖానలో చేర్పించి డ్రైవర్, కండక్టర్ మానవత్వం చాటుకున్నారు. ముషీరాబాద్ డిపోకు చెందిన బస్సు(టీఎస్02జెడ్ 0341)శుక్రవారం ఉదయం ఆరాంఘర్ నుంచి సికింద్రాబాద్‌కు బయల్దేరింది. ఇదే బస్సులో శ్వేతారత్నం అనే నిండు గర్భిణి ఎక్కింది. బస్సు బహదూర్‌పురాకు చేరుకోగానే గర్భవతికి నొప్పులు అధికమవడంతో డ్రైవర్ ఎంఎం అలీ బస్సును పక్కన నిలిపి ప్రయాణికులను కిందికి దించాడు. ఈ క్రమంలో కండక్టర్ సరోజ తోటి మహిళా ప్రయాణికుల సాయంతో గర్భిణికి ప్రసవం చేయగా, పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం తిరిగి అదే బస్సులో పురానాపూల్ ప్రభుత్వ ప్రసూతి దవాఖానలో తల్లీబిడ్డలను అడ్మిట్ చేయించారు. ప్రస్తుతం వారు క్షేమంగా ఉన్నారు. ప్రత్యేక చొరవ చూపిన డ్రైవర్, కండక్టర్‌ను ప్రయాణికులు అభినందించారు. విషయం తెలుసుకున్న టీజీఆర్టీసీ హైదరాబాద్ రీజియన్ మేనేజర్ వరప్రసాద్ ఎంజీబీఎస్‌లోని తన కార్యాలయంలో డ్రైవర్, కండక్టర్‌ను సన్మానించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వారిని అభినందించారు. సన్మాన కార్యక్రమంలో హైదరాబాద్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ జగన్, బర్కత్‌పుర, కాచిగూడ డీఎంలు వేణు, రఘు, ముషీరాబాద్ ఏడీఎం కళ్యాణి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో గర్భిణికి ప్రసవం చేసిన కండక్టర్ సరోజ, తోటి ప్రయాణికురాలు